క్లుప్తంగా

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



నెహ్రూ నగర్: ప్రజా సంక్షేమానికి కృషి చేసిన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు ఎన్టీ రామారావు సేవలు స్మరణీయమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు.

డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో..

గుంటూరు మెడికల్: స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలో బుధవారం ఉమ్మడి ఏపీ మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

అహల్యబాయి హోల్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

గుంటూరు మెడికల్: అహల్యబాయి హోల్కర్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి నూకల మధుకర్ అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో బుధవారం అమరావతి రోడ్డు హిందూ ఫార్మసీ కళాశాలలో అహల్యబాయి హోల్కర్ త్రిశతాబ్ది ఉత్సవాల అవగాహన కార్యక్రమం జరిగింది.

రామకృష్ణకు డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ పరిశోధకుడు పి.రామకృష్ణకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ పరిశోధనా పర్యవేక్షకులు, ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు పర్యవేక్షణలో 'టెక్స్ట్ క్లస్టరింగ్ అండ్ డాక్యుమెంట్ క్లాసిఫికేషన్ టెక్నిక్స్ యూజింగ్ డీప్ కాంటెక్స్చువల్ ఎంబీడింగ్స్ అండ్ ఎక్స్‌టెండెడ్ గ్లోవ్ మెథడ్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకుగాను రామకృష్ణకు డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందన్నారు.

సినిమా థియేటర్ల తనిఖీ



గుంటూరు వెస్ట్: జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ ఆదేశాల మేరకు ఆర్‌ఐ మాణిక్యాలరావు, సివిల్ సప్లైస్ డీటీ బేగ్ తదితరులు నగరంలోని పలు థియేటర్లలో తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి కొనసాగిన ఈ తనిఖీలు హరిహరమహల్, హాలీవుడ్, బాలీవుడ్, సినిప్రైమ్, ప్లాటినం, జేఎల్‌ఈ తదితర థియేటర్లలో తనిఖీలు నిర్వహించారు.

కవి కత్తి పద్మారావుకు సత్కారం



పొన్నూరు: కవి డాక్టర్. కత్తి పద్మారావును ఉత్తమ థిసిస్ అవార్డు గ్రహీత మొయిలీ శ్రీరాములు ఘనంగా సత్కరించారు. బుధవారం పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌ను శ్రీరాములు సందర్శించి కత్తి పద్మారావును ఆత్మీయంగా పలకరించారు. పీహెచ్‌డీ చేసి 2004వ సంవత్సరంలో ఆంధ్ర యూనివర్సిటీలో థిసిస్ అవార్డు పొందిన శ్రీరాములను పద్మారావు అభినందించారు.

గణపతికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామం జలపాలేశ్వర ఆలయంలోని గణనాథునికి విశేష పూజలు చేశారు. బుధవారం అర్చకులు ఉమాపతిశాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాలతో పూజలు చేసి గరికతో అష్టోత్తర, సహస్రనామ అర్చనలు చేశారు. పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం నుంచి కృష్ణాయపాలెం వెళ్లే రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. యర్రబాలెం నుంచి కృష్ణాయపాలెంకు ద్విచక్రవాహనంపై హఫీజ్ వెళుతున్నాడు. ఎదురుగా మరో ద్విచక్రవాహనంపై వస్తున్న రమేష్ను హఫీజ్ ఢీకొన్నాడు. ఘటనలో వాహనాలు నడుపుతున్న ఇద్దరు యువకులు గాయపడ్డారు.

జూన్ 4న వెన్నుపోటు దినం జయప్రదం చేయాలి

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా



డివిజన్ అధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతున్న నూరిఫాతిమా

పట్నంబజారు: జూన్ 4న రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ వైఎస్సార్ సీపీ చేపట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పిలుపునిచ్చారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కార్యాలయంలో బుధవారం డివిజన్ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. నూరిఫాతిమా మాట్లాడుతూ ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలా వంచించిందని విమర్శించారు. ఒక్క సంక్షేమ పథకం కూడా అందజేయకుండా వెన్నుపోటు పొడిచిందని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జరిగే వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. డివిజన్లలో సమస్యలకు సంబంధించి ప్రజల వద్దకు వెళ్లి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తెలుసుకుని వాటి పరిష్కరించే దిశగా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు, నేతలు అనే తేడా వైఎస్సార్‌సీపీలో లేదని, ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా ముందుకు సాగాలన్నారు. అందరం కలిసి కృషి చేయడం ద్వారానే రాబోయే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో వైఎస్సార్‌సీపీ జెండాను రెపరెపలాడించగలుగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పశుపులేటి రామయ్య, జాఫర్‌ఖాన్, కోటేశ్వరరావు, పుల్లా కిషోర్, మురళి, వెంకటేశ్వర్లు, తుమ్మేటి శ్రీను, సాల్మాన్, మల్లవరపు దాసు, షంషేర్, రాజేష్ పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్‌లపై పర్యవేక్షణ ఉండాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ట్రాక్ పరిశీలిస్తున్న కమిషనర్

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలోని పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్ ఎక్విప్మెంట్‌లను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. ఆర్టీసీ కాలనీ పార్క్, కాకాని రోడ్, సీతా నగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పార్కుల్లో నూతనంగా చేట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ కాలనీ పార్క్‌లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఎక్విప్మెంట్ ల మరమ్మతులు చేపట్టాలని ఏఈకి సూచించారు. పార్కుల్లో పచ్చదనం పెంపునకు ఉద్యానవన విభాగ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వర్షాలకు పార్కుల వాకింగ్ ట్రాక్‌లలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించి, నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయడం ద్వారా ప్రధాన ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్ లేకుండా చేయవచ్చని, అందుకు పిన్ పాయింట్‌గా పారిశుద్ధ్య పనులు జరిగేందుకు సచివాలయం పరిధిలో కార్మికుల హాజరు, పనితీరు, పారిశుద్ధ్య పూర్తిగా శానిటేషన్ కార్యదర్శే బాధ్యత వహించాలని కోరారు. డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఎస్‌లు మధ్యాహ్నం సమయంలో కార్మికులు డ్రెయిన్లు శుభ్రం చేసేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అవుట్ ఫాల్ డ్రెయిన్లు తీసిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నోడల్ అధికారులు ప్రతి రోజు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షణ చేసి, లోపాలు ఉన్న ప్రాంతాల్లో నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. పర్యటనలో కార్పొరేటర్ కె.రంగారెడ్డి, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, ఆర్‌ఓ సాదిక్ బాషా పాల్గొన్నారు.

ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న నిర్వాహకులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై బుధవారం భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదిత్య హృదయ పారాయణం, శృంగార నైషధంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఆధ్యాత్మిక ప్రవచకురాలు డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి ప్రవచిస్తూ పాకిస్థాన్‌తో యుద్ధంలో భారత దేశమే పైచేయి కావాలని అన్నారు. కోవిడ్-19 బారిన పడకుండా ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. భాగవత గోష్ఠితో మూడుసార్లు ఆదిత్య హృదయ పారాయణం నిర్వహించారని అన్నారు. అనంతరం శృంగార నైషధంలోని ఇతివృత్తాన్ని వివరించారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



ప్రత్తిపాడు: డ్వాక్రా మహిళలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యక్తిగత ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు కృషి చేయాలని వెలుగు ఏపీఎం వి.లాజరు అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని గంగమ్మ ఆలయ ఆవరణలో బుధవారం డ్వాక్రా సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. హాజరైన ఆయన మాట్లాడుతూ.. యాన్యువల్ క్రెడిట్ లైవ్లీ హుడ్ యాక్షన్ ప్లాన్ నుంచి మైక్రో క్రెడిట్ ప్లాన్‌లను తయారు చేయాలని సూచించారు. స్వయం ఉపాధి యూనిట్లు నెలకొలుపేందుకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేస్తున్నారని అన్నారు. డ్వాక్రా గ్రూపుల రీపేమెంట్ ట్రాక్ ఆధారంగా అత్యధిక రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు చొరవ చూపుతున్నారని తెలిపారు. ప్రతి మహిళా ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకోవడమే లక్ష్యమని అన్నారు. సమావేశంలో సీసీలు, వీవోఏలు, డ్వాక్రా గ్రూపుల లీడర్లు పాల్గొన్నారు.

30న చలో మహిళా కమిషనర్ కార్యాలయం



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య

నెహ్రూనగర్: రజక మహిళ తోరటి అనూష అనుమానాస్పద మృతిపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ 30వ తేదీన చలో మహిళా కమిషనర్ ముట్టడి నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రజక వృత్తి దోబీ ఘాట్ల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు చెన్నూరి చెన్నయ్య తెలిపారు. ఈ మేరకు కాకాని రోడ్డులో బుధవారం అనూష కుటుంబ సభ్యులతో కలసి విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ భార్యను అడ్డుతొలగించుకోవాలనే ఉద్దేశంతో అనూష భర్త గర్భిణి అయినప్పటికీ ఆమెను సరైన వైద్యం అందించడలో నిర్లక్ష్యం వహించాడని ఆరోపించారు. ప్రయాణం చేయించకూడదని డాక్టర్లు చెప్పినా కావాలనే ప్రయాణాలు చేయించి అనూషను తీవ్ర ఇబ్బందులు ఇబ్బందులకు గురి చేశాడని ఆరోపించారు. దీంతో పాటు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యురాలి నిర్లక్ష్యంగా వ్యవహరించి అనూష మృతికి..బిడ్డ మృతికి కారుకులయ్యారని.. ఇదంతా ఒక పథకం ప్రకారమే జరిగిందన్నారు. దీనిపై నిజనిర్ధారణ చేయాలని డిమాండ్‌తో చలో మహిళా కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్నట్లు చెప్పారు.

రెండేళ్ల తర్వాత సోదరుడికి అప్పగింత



నవనాథగంగారంషిండేను సోదరుడికి అప్పగిస్తున్న హోం నిర్వాహకులు, ఏఎస్ఐ బేబిరాణి

నగరంపాలెం: మతిస్థిమితం లేని ఓ యువకుడ్ని జిల్లా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. రెండేళ్ల క్రితం పొన్నూరు బస్టాండ్ వద్ద మతిస్థిమితం సరిగాలేని 15 ఏళ్ల యువకుడ్ని జిల్లా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఏఎస్ఐ బేబిరాణి గుర్తించారు. అతని సంరక్షణార్థం గుంటూరు నగరంలోని కార్మెల్ హోంలో చేర్పించారు. సదరు యువకుడి కుటుంబ సభ్యులను గుర్తించేందుకు హోం ఇన్‌చార్జి వీరశంకర్, ఏఎస్ఐ బేబిరాణి అనేక విధాలుగా ప్రయత్నించారు. ఈ క్రమంలో అతని వేలిముద్రల ఆధారంగా ఆధార్ కార్డు గుర్తించారు. మహారాష్ట్ర థానే జిల్లా తిలక్‌నగర్‌లో ఉంటున్న కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మతిస్థిమితం సరిగా లేని యువకుడి పేరు నవనాథ గంగారంషిండే అని సోదరుడు వైభవ్ గంగారం షిండే బుధవారం తెలియజేశారు. దీంతో అతన్ని సోదరుడికి అప్పగించారు. యువకుడ్ని క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన హోం ఇన్‌చార్జి వీరశంకర్, సిబ్బందిని, ఏఎస్ఐ బేబిరాణిని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

ముగ్గురు జూదరులు అరెస్టు

పొన్నూరు: పట్టణంలో విచ్చలవిడిగా సాగుతున్న మట్కా జూదాన్ని అరికట్టేందుకు సీఐ వీరానాయక్ కఠిన చర్యలు చేపట్టారు. ప్రధాన సెంటర్‌లోని బస్ స్టాప్‌ల వద్ద మట్కా నిర్వహిస్తున్న నారాయణ శ్రీనివాస ఆంజనేయులు, కనిశెట్టి వెంకట సుబ్బారావు, సయ్యద్ కరిముల్లాలను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1800లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పట్టణంలో మట్కా, జూదం, సింగిల్ నెంబర్లు తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించమని అన్నారు. పట్టణంలో ఎక్కడైనా జూదం నిర్వహిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం



వాహనాన్ని ప్రారంభిస్తున్న అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు

నగరంపాలెం: సేవా రంగంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జ్యువెలరీ నిర్వహిస్తోన్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అరండల్‌పేట పీఎస్ సీఐ ఆరోగ్యరాజు అన్నారు. లక్ష్మీపురం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జ్యువెలరీ షోరూం వద్ద హంగర్ ఫ్రీ వరల్డ్ అనౌన్స్ ఈవెంట్ వాహనాన్ని బుధవారం సీఐ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పేద ప్రజలకు ఆకలిని తీర్చడం, విలువైన విద్యను అందించేలా చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని అన్నారు. స్టోర్ మార్కెటింగ్ మేనేజర్ గోపీకిరణ్ మాట్లాడుతూ గత మూడేళ్లల్లో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జ్యువెలరీ సంస్థ పేదల కోసం రూ.310 కోట్లు ఖర్చు చేశారని అన్నారు. ఈ ఏడాది రూ.150 కోట్లు కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో స్టోర్ హెడ్ నదీర్, పెద్ది రమణారావు పాల్గొన్నారు.

• పగుళ్ల దారితో ప్రమాదాలు!



పగుళ్లు తీసిన డీవీసీ కాలనీ రహదారి

పట్టణంలోని డీవీసీ కాలనీ రహదారి పగుళ్లు తీసింది. దీంతో వాహన చోదకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రహదారుల నిర్మాణాలు నాసిరకంగా చేపట్టడంతో పగుళ్లు ఏర్పడ్డాయని స్థానికులు వాపోతున్నారు. పలు సందర్భాల్లో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చోదకులు తెలిపారు. రాత్రి సమయంలో సమస్య మరింత తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పాడైన రహదారికి మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాలను నియంత్రించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. - పొన్నూరు

చిన్నారికి నాట్యమయూరి అవార్డు



అవార్డు అందుకుంటున్న అక్షిత

మంగళగిరి టౌన్: మంగళగిరికి చెందిన మునగాల జయ అక్షితకు నాట్యమయూరి అవార్డు లభించింది. గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు కళానిలయం ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి 40వ శాస్త్రీయ, పాశ్చాత్య సంగీత, నృత్య పోటీల్లో అక్షిత పాల్గొని ప్రతిభ కనబరిచింది. కూచిపూడి 'ఏ' గ్రూప్‌లో భామాకలాపం నృత్య ప్రదర్శనకు ప్రథమ బహుమతిని సాధించింది. ఈ సందర్భంగా బుధవారం కళానిలయం ఆధ్వర్యంలో అక్షితకు నాట్యమయూరి అవార్డును ప్రదానం చేశారు. అక్షిత మంగళగిరి నగర పరిధిలోని ఓ ప్రైవేటు స్కూలులో 9వ తరగతి చదవుతోంది. అవార్డు పొందిన అక్షితను తల్లిదండ్రులు మునగాల మురళీకృష్ణ, మౌనికలతో పాటు నగర పరిధిలోని పలువురు ప్రముఖులు అభినందించారు.

ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌కు అదనపు స్థలం పరిశీలించాలి



ప్రత్తిపాడులోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌కు అదనపు స్థలం పరిశీలించి, మరింత మెరుగ్గా వ్యర్థాల నిర్వహణను చేపట్టాలని డీఎల్‌పీవో కె.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని ప్రత్తిపాడు, తిక్కిరెడ్డిపాలెం గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను బుధవారం ఆయన పరిశీలించారు. చెత్త సేకరణ, నిర్వహణపై ఆయా గ్రామాల కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్తిపాడు మేజర్ పంచాయతీ కావడంతో రోజూ 6 నుంచి 7 ట్రక్కుల వ్యర్థాలు సమీకరిస్తున్నామని సెక్రటరీ ఖాజా వివరించారు. తడి, పొడి వ్యర్థాలను వేరు చేయగా మిగిలిన వ్యర్థాలను జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో సెక్రటరీని ఆదేశించారు. ప్రత్తిపాడు డంపింగ్ యార్డుకు ప్రస్తుతం ఉన్న స్థలం సరిపోయే పరిస్థితి లేదని.. రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అదనపు స్థలం సమీకరణకు కృషి చేయాలని కార్యదర్శికి సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా

మంగళగిరి టౌన్: వర్షాకాలం సమీపిస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా కోరారు. మంగళగిరి నగర పరిధిలోని ఈద్గా కల్యాణ మండపంలో బుధవారం ఫ్రైడే-డ్రైడే, దోమల నివారణపై ఏఎన్ఎంలు, శానిటరీ సెక్రటరీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని.. వీటిని అరికట్టేందుకు ఇంటి పరిసరాలలో ఉండే నీటి తొట్టెలు, టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది వ్యాధులు వచ్చే ప్రమాదముందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, ఇందిరా నగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, శానిటేషన్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పొగాకుపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

దుగ్గిరాల: ఈనెల 31 పొగాకు, వాటి ఉత్పత్తుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజలను చైతన్యం పరిచే పోస్టర్ ఆవిష్కరణను ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. స్థానిక శివాలయం దగ్గర జరిగిన ఈ కార్యక్రమంలో కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 1988 సంవత్సరం నుంచి ప్రపంచ ఆరోగ్య సంస్థ మే 31న పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తుందని అన్నారు. పొగాకు వల్ల అనారోగ్య సమస్యలతో ఏటా ప్రపంచ వ్యాప్తంగా 80 లక్షల మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. మన దేశంలో 13.5 లక్షల మంది మృత్యువాత పడుతున్నారని అన్నారు. పొగాకును వదిలి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎం.గాంధీ, జెట్టి బాలరాజు, షేక్. సుభాని, పి.గణేష్, ఉమా మహేశ్వరరావు. నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు



తుమ్మలపాలెంలో జూటు బ్యాగులు పంపిణీ చేస్తున్న డీపీఓ

ప్రత్తిపాడు: ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు ఎదురవుతాయని.. గ్రామంలో ప్లాస్టిక్‌ను నిషేధించాలని జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయి కుమార్ అన్నారు. మండలంలోని తుమ్మలపాలెంలో బుధవారం స్థానిక అధికారులతో కలిసి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ (లోకల్ ట్రెనింగ్ సెంటర్)ను డీపీవో సదర్శించారు. అనంతరం గ్రామంలోని అంతర్గత వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. తడి, పొడి వ్యర్థాలపై గ్రామంలో విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కార్యదర్శి ఖాజాను ఆదేశించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా మైకుల ద్వారా ప్రచారం, వాల్ పెయింట్స్, కరపత్రాల పంపిణీ వంటివి చేపట్టాలన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా గ్రామంలో ప్లాస్టిక్ నిషేధం విధించాలని, ప్లాస్టిక్ వాడకం వల్ల ఎదురయ్యే సమస్యలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఐటీసీ మరియు ఫినిష్ సొసైటీ సంయుక్తంగా సమకూర్చిన జూట్ బ్యాగులను ఆయన ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. డిఎల్‌పీవో శ్రీనివాసరావు, డీపీఆర్‌సీ రిసోర్స్ పర్సన్‌లు నిరంజన్ కుమార్, కరీముద్దీన్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు, ఐటీసీ, ఫినిష్ సొసైటీ కోఆర్డినేటర్ ఉమా మహేశ్వరి, క్లాప్ మిత్రలు, షెడ్ మిత్రలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



పొన్నూరు: బాల్య వివాహాలను అరికట్టే విధంగా గ్రామస్థాయి అధికారులు బాధ్యతలు నిర్వర్తించాలని సీఆర్ఏఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ కోలా సమీర్‌కుమార్, సీడీపీఓ ఎస్. వెంకట రమణ అన్నారు. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సీఆర్ఏఎఫ్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగే సమాచారాన్ని తెలియజేయాలని కోరారు. 18 ఏళ్లలోపు ఆడపిల్లలు, 21 ఏళ్లలోపు మగపిల్లలకు వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని అన్నారు. బాల్య వివాహ నిరోధంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఏపీఎం జోజిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీఆర్ఏఎఫ్ సీఎస్‌డబ్ల్యూ డి.అక్కయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెనాలి పోలీసుల తీరుపై సమగ్ర విచారణ జరపాలి

పెదకాకాని: దళిత, మైనార్టీ యువకుల పట్ల తెనాలి పోలీసులు వ్యవహరించిన తీరు దారుణంగా ఉందని.. సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా సీపీఐ టీయూ కార్యదర్శి నన్నపనేని శివాజీ బుధవారం ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 24వ తేదీన పోలీసు కానిస్టేబుల్ కన్నా చిరంజీవిపై నిందితులు దాడి చేశారని ఎస్సీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన యువకులను నడి రోడ్డుపై ఇష్టానుసారంగా కొట్టి గాయపరచిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. నిందితులను కొట్టే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో పోలీస్ వ్యవస్థపై గౌరవం పెరగాలి కానీ నమ్మకం కోల్పోవడం, వ్యతిరేకత ఏర్పడటం సమాజానికి మంచిది కాదని హితవు పలికారు. ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.